అమ్మవారికి లక్ష పుష్పార్చన

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా సోమవారం ఐదో రోజున వివిధ ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వరీదేవికి, శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు.ఐనవోలులో శ్రీ భ్రమరాంబికాదేవి స్కందమాతగా దర్శనమిచ్చారు.

న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా, వరంగల్ సాంస్కృతికం, ఐనవోలు



వేయిస్తంభాల దేవాలయంలో..



పద్మాక్షి



స్కందమాతగా భ్రమరాంబికాదేవి

పండగ పూట.. తాగునీటి గోస

● పర్యవేక్షణ కరవై ప్రజలకు చేరలేని దుస్థితి


లెక్కల్లోనే..

నగర జనాభా 11 లక్షల పైచిలుకు ఉంటుంది. ప్రతిరోజూ 190 మిలియన్ లీటర్స్ పర్ డే (ఎంఎల్‌డీలు) ఇవ్వాల్సి ఉండగా.. ప్రస్తుతం 205.41 ఎంఎల్‌డీ ఇస్తున్నారు. లెక్కకు మించి నీటి సరఫరా చేస్తున్నట్లు బల్దియా లెక్కలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అన్నిచోట్ల ఆ పరిస్థితి లేదు.

30 శాతం వృథా..

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ప్రతి రోజూ 30శాతం నీటి వృథా(క్లియర్ వాటర్) అవుతోందని సర్వేలో తేలింది. పైపులైన్ లీకేజీలు, మెయిన్ పైపులైన్లకు బైపాస్ లైన్లు ఉండటం, అక్రమ కుళాయిలు తదితర కారణాలతో ప్రతిరోజూ 55-60 ఎంఎల్‌డీల తాగునీరు వృథా అవుతోంది.

కార్పొరేషన్, న్యూస్‌టుడే



సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల వేళ నగరంలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ధర్మసాగర్ చెరువులో సమృద్ధిగా నీళ్లు ఉన్నా.. శుద్ధీకరణకు సరిపడా వ్యవస్థ ఉన్నా నగర ప్రజలు దాహంతో అల్లాడాల్సిన పరిస్థితి. గ్రేటర్ వరంగల్ ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. రెండు, మూడు వారాలుగా కుళాయిల్లో రంగుమారిన నీళ్లు సరఫరా అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సోమవారం 'న్యూస్‌టుడే' బృందం కాలనీల్లో నీటి సరఫరాపై పరిశీలన చేపట్టగా.. అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

పరిశీలన

సమస్యలు ఇలా..

- క్షేత్రస్థాయిలో లైన్‌మెన్లు, ఇతర సిబ్బంది కొరత
- ఏఈలు, డీఈలు నీటి సరఫరాను పట్టించుకోవడం లేదు.
- సమయపాలన పాటించడం లేదు.
- నిర్ణీత సమయానికి డివిజన్లలో వాటర్ ట్యాంకులు నిండటం లేదు.
- నీటి వృథాపై ఎలాంటి చర్యలు లేవు.
- తాగునీటి సరఫరా విభాగంలో సరిపడా సిబ్బంది లేరు.



దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో తాగునీటిని పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి



ధర్మసాగర్ చెరువులో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది



మట్టిరంగులో వచ్చిన తాగునీరు

కలుషితం..

నయీంనగర్, న్యూస్‌టుడే: హనుమకొండ ప్రాంతం 52, 53 డివిజన్ లష్కర్‌సింగారం, రాజాజీనగర్, ఆదర్శకాలనీ, అశోకకాలనీ, రాంనగర్, నయీంనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీరు రంగు మారి వస్తోంది. లీకేజీలతోనే ఇలా వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

నాలుగు రోజులకోసారి.. గంటసేపు మాత్రమే!

ఖిలావరంగల్: ఖిలావరంగల్ పడమర, మధ్య, తూర్పుకోట, పుప్పాలగుట్ట, చింతల్ 36, 37, 38 డివిజన్లలో నాలుగు రోజులకో గంటపాటు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని ప్రధాన నీళ్ల ట్యాంకులకు పంపింగ్‌లో ఏర్పడిన జాప్యం జరగడం వల్ల సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. 43వ డివిజన్ పరిధిలోని నాయుడు పెట్రోల్ పంపు, వినాయకకాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో పైపులైన్ నిర్మాణం చేపట్టలేదు.

లీకేజీలతో

న్యూస్‌టుడే-హసన్‌పర్తి: హసన్‌పర్తితోపాటు ఎర్రగట్టుగుట్ట, పద్మశాలి కాలనీ రోడ్డు, భీమారం, శ్రీనివాసకాలనీ, మంత్రపురి కాలనీ, సదానంద కాలనీ, ఆనందనగర్ కాలనీ, రామారం ప్రాంతాల్లో తాగునీటి సమస్య అధికంగా కనిపిస్తోంది. అనేక చోట్ల మిషన్ భగీరథ పైపులైన్లు పగిలి పోయి లీజీకే సమస్య ఇందుకు కారణమవుతోంది. దీంతో సరిపడా రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదీ సమయపాలన లేకుండా నీరు వదులుతుండడంతో తాగునీటికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎర్రగట్టుగుట్ట సమీపంలో పైప్‌లైన్ పగిలిపోయి

ఇబ్బందులు రాకుండా చూస్తాం

- ప్రవీణ్‌చంద్ర, ఎస్‌ఈ, నీటి సరఫరా

పండగ పూట ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. నాలుగైదు రోజులుగా ఇదే పనిలో ఉన్నాం. పుప్పాలగుట్ట, కరీమాబాద్ ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయి. వాటిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం.

సరిపడా అందటం లేదు

పరికిపండ్ల వేణు, ఆదర్శ కాలనీ



సరిపడా తాగునీరు రాక కాలనీ వాసులం ఇబ్బందులు పడుతున్నాం. కలుషిత నీరు వస్తుండటంతో అనారోగ్యానికి గురవుతున్నాం. సమస్యపై గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు దృష్టిసారించి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి సరిపడా శుద్ధమైన నీరు అందించాలి.

'కులగణనతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యం'



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సారయ్య

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: రాజ్యాధికారం, సామాజిక న్యాయం కోసం బీసీలంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. సోమవారం హంటర్ రోడ్డులోని ఓ కళాశాలలో బీసీ జేఏసీ కన్వీనర్, కుడా మాజీ ఛైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అధ్యక్షతన బీసీ ధూంధాం సన్నాహక సమావేశం జరిగింది. సారయ్య మాట్లాడుతూ అగ్రవర్ణాలు బీసీలను కులాల వారీగా చీల్చి అనైక్యతను సృష్టించి వారి పీఠాలు కదలకుండా చూసుకుంటున్నారని పేర్కొన్నారు. బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే బీసీ కుల గణన చేపట్టాలన్నారు. బీసీ కులాలన్నీ రిజర్వేషన్ల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీ జేఏసీ ఛైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ బీసీ ఉద్యమం బలంగా ఎదగాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఐక్యతను చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ ఉద్యమాన్ని ఓరుగల్లు నుంచే ప్రారంభించి, తెగించి కొట్లాడుదామని విశ్రాంత ఆచార్యుడు గడ్డం భాస్కర్ విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా బీసీ ఉద్యమంలో పాల్గొనాలని చెప్పారు. రాజ్యాధికారంలో మన వాటా మనకు దక్కేంత వరకు పోరాటం చేద్దామని డాక్టర్ కాళీప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో వేణుమాధవ్ గౌడ్, పులి రజినీకాంత్, శ్రీధర్, మునిగాల సమ్మయ్య, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా బీసీ జేఏసీ ఛైర్మన్‌గా సుందర్‌రాజ్ యాదవ్‌ను 14 మండలాల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా వంగ రవి, వేల్పుల సారంగపాణి, చీకటి ఆనంద్, సత్యనారాయణలను నియమించారు.

ఎన్పీడీసీఎల్ ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు సిద్ధం

బాలసముద్రం, న్యూస్‌టుడే : టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. విధుల్లో చేరి 2024 జూన్ 30 నాటికి ఒకే చోట రెండేళ్లు పూర్తి చేసుకున్న వారిలో 50 శాతం మందిని బదిలీ చేసేలా బదిలీ ఉత్తర్వులు సిద్ధంచేశారు. సబ్ ఇంజినీర్, అకౌంట్స్, ఫోర్‌మెన్, ఎస్‌ఎల్ఐ, తదితర ఉద్యోగులను సర్కిల్ ఎస్ఈ స్థాయిలో, అపై అధికారులను ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి బదిలీ చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 231 మంది అధికారులు, సిబ్బందికిగాను 117 మంది, వరంగల్ జిల్లాలో 264 మందికి 136 మంది బదిలీ కానున్నారు.

ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న జి.సీతారెడ్డి హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు, ఇక్కడ పనిచేస్తున్న ఎం.ఎ.షుకూర్ ఇంతేజార్‌గంజ్‌కు బదిలీ అయ్యారు. కమిషనరేట్‌లో నుంచి జె.వెంకటరత్నం మిల్స్ కాలనీ స్టేషన్ సీఐగా వెళుతున్నారు.

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిగా వెంకటేశం

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ తొలి అధికారిగా ఎం. వెంకటేశంను నియమించారు. కొత్త జిల్లాల ఆవిర్భావం నుంచి హనుమకొండ జిల్లా ఉద్యానశాఖకు ప్రత్యేకంగా అధికారిని నియమించలేదు. గత పదేళ్లగా వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఒక్కరే అధికారి ఉన్నారు. అసిఫాబాద్ జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా పనిచేస్తున్న వెంకటేశం సోమవారం వరంగల్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి.సంగీతలక్ష్మి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను కలిశారు.





ఈవీ.. ఛార్జింగ్ కేంద్రాలేవీ?

● ఓరుగల్లులో పెరుగుతున్న విద్యుత్తు వాహనాలు

ప్రయివేటు కంపెనీలు ఏర్పాటుచేసిన రెండు మూడు చిన్న ఛార్జింగ్ పాయింట్లు మాత్రమే వరంగల్ ప్రాంతంలో ఉన్నాయి.

'మూడేళ్ల కిందట తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ (టీజీ రెడ్కో) నగరంలో పది ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు సర్వే చేపట్టింది. విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.'




ఈనాడు, వరంగల్, రంగశాయిపేట, న్యూస్‌టుడే

రోజురోజుకు పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు, ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వాలు విద్యుత్తు వాహనాలను (ఈవీ) ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలో రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఈ వాహనాలను విక్రయించే షోరూంల సంఖ్య పెరుగుతోంది. ఈ- కార్లు, విద్యుత్తు ఆటోలు, ఇతర పెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కోసం నగరంలో సరిపడా ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం పెద్ద లోటు. హైదరాబాద్ పరిధిలో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన రెడ్కో ఓరుగల్లులో పెట్టకపోవడంతో సుదూరాల నుంచి నగరానికి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

నిట్ సాంకేతిక అండ

నగరంలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ పూర్తి సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. రెండేళ్ల కిందట 'ఆప్టిమల్ లొకేషన్ ఆఫ్ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ వరంగల్' అనే పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పేర్లి సురేశ్‌బాబు నేతృత్వంలో దీన్ని పూర్తి చేశారు. నగరంలో వాహనాల రద్దీ దృష్ట్యా ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఎక్కడెక్కడ వస్తే బాగుంటుంది.. సబ్‌స్టేషన్ల నుంచి ఏ మేరకు విద్యుత్తు అవసరం ఉంటుందని లోతుగా అధ్యయనం చేసి పరిశోధన పత్రం రాస్తే అది స్విట్జర్లాండ్ జర్నల్‌లో ప్రచురితమైంది. నగరంలో 39 కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆ ప్రాజెక్టు ద్వారా గుర్తించారు.



ఈవీ ఛార్జింగ్ స్టేషన్లపై నిట్ రూపొందించిన ప్రాజెక్టు

స్టేషన్ల ఏర్పాటు ఎంతో అవసరం



వరంగల్‌లో ప్రైవేటు ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్

వాహనాల్లో పెట్రోలు, డీజిల్ వేయించుకోవడం సులువు. రెండు మూడు నిమిషాల్లో పూర్తవుతుంది. అదే విద్యుత్తు ఛార్జింగ్‌కు చాలా సమయం పడుతుంది. గంటల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో స్టేషన్లు ఉంటే కూర్చునేందుకు కుర్చీలు, మంచినీటి సౌకర్యం ఉంటాయి. వీటిని ప్రభుత్వం ఏర్పాటుచేస్తే విద్యుత్తు ధరలు కూడా తక్కువగా ఉంటాయి.


● నగర వాసులు డీజిల్, పెట్రోల్ నుంచి ఎల్‌పీజీ, సీఎన్‌జీకి.. ఇప్పుడు క్రమంగా ఈవీలపై ఆసక్తి చూపుతున్నారు. 2022లో హనుమకొండ జిల్లాలో ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాలు 375 రిజిస్ట్రేషన్ కాగా.. గతేడాది 736, ఈ ఏడాది ఇప్పటికే 950 దాటిపోయాయి. కార్ల కొనుగోలుపై నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. రెండేళ్ల కిందట 15 ఉండగా, గతేడాది 67కు చేరాయి. ఈ ఏడాది ఇప్పటికే 36 దాటిపోయాయి. డిసెంబరు కల్లా వందకు చేరే అవకాశం ఉంది.

ఆర్టీసీ కూడా మరిచింది

వరంగల్ రీజియన్ ఆర్టీసీ బస్సుల్లో కొన్ని ఈవీలను వినియోగిస్తామని మూడేళ్ల కిందట ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఆర్టీసీ అనేక ఈ బస్సులను తీసుకొచ్చింది. అదే స్ఫూర్తితో మొదటి దఫాలో ఓరుగల్లు నగరంలో 10 విద్యుత్తు బస్సులు తెస్తామని ప్రకటించి.. అంతటితో ఆ ప్రతిపాదన అటకెక్కించింది.



ఈవీ ఆటో



దిల్లీ విధానం భేష్

కేంద్ర ప్రభుత్వం 2030 కల్లా దేశంలో సగానికి సగం విద్యుత్తు వాహనాలనే రహదారులపై తీసుకురావాలనుకుంటోంది. ఈ క్రమంలో దిల్లీ ప్రభుత్వం అక్కడి వాయు కాలుష్యం దృష్ట్యా ఈవీలను బాగా ప్రోత్సహిస్తోంది. 'స్విచ్ దిల్లీ' పేరుతో పాలసీ రూపొందించింది. 30 వేల ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే 2,452 ఏర్పాటు చేసింది. ఛార్జింగ్ స్టేషన్లు 1,919 ఉన్నాయి.

కార్లకు కష్టమే

- శ్రీకాంత్, హనుమకొండ



నాకు ద్విచక్ర విద్యుత్తు వాహనం ఉంది. ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టుకుంటాను. మా స్నేహితులు హైదరాబాద్ నుంచి హనుమకొండకు వచ్చినప్పుడు అదనపు బ్యాటరీలు తెచ్చుకుంటున్నారు. లేదా మా ఇంట్లో ఛార్జింగ్ పెట్టడం వల్ల గంటల తరబడి సమయం వృథా అవుతోంది. ఛార్జింగ్ స్టేషన్ ఉంటే కొద్ది సమయం సరిపోతుంది. ఓరుగల్లు నగరంలో ప్రభుత్వం ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి.



నెట్టింట్లో.. అమ్మేస్తున్నారు!

● అరుదైన జంతువుల అక్రమ రవాణా

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి

ఉమ్మడి వరంగల్ జిల్లా అడవుల్లో వన్యప్రాణులకు నెలవైన ప్రాంతాలున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గోదావరి తీరం వెంట దట్టమైన, పచ్చని అడవుల్లో జంతువుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. వేటగాళ్లతో వాటికి ముప్పు వాటిల్లుతోంది.. గుట్టుగా వేటాడి వన్యప్రాణుల చర్మాలు, గోళ్లు, మాంసంతో వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. వేట మాత్రం ఆగడం లేదు.. గత శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అరుదైన జంతువులను ఏకంగా ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. నూతన పంథాలో దుండగులు పాంగోలిన్(అలుగు)ను అక్రమ రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.

చెన్నై బ్యూరో సభ్యులు మాటేసి..

ఇక్కడ ఇంత తతంగం జరుగుతున్నా.. స్థానిక అధికారులు ఈ విషయాన్ని పసిగట్టలేదు. వాట్సాప్ గ్రూపును చెన్నై కేంద్రంగా నడిచే వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డు గుర్తించింది. ఆ వాట్సాప్ గ్రూప్‌లో బ్యూరో సభ్యులు కొనుగోలుదారులుగా సంప్రదింపులు చేశారు. ఇద్దరు సభ్యులు ఆ నెంబర్ల ఆధారంగా చాట్ చేసుకుంటూ వరంగల్ చేరుకున్నారు. దుండగులు చెప్పినట్లుగా భూపాలపల్లి, కాటారం ప్రాంతాలకు వచ్చారు. మాటు వేసి అలుగును, ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.

వాట్సాప్ గ్రూపు ఏర్పాటు..

పాంగోలిన్ లాంటి అరుదైన వన్యప్రాణుల విక్రయాలకు దేశవ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పురాతన వస్తువుల పేరిట దేశవ్యాప్త నెట్‌వర్క్‌తో ఓ వాట్సాప్ గ్రూపు నడుపుతున్నారు. ఇందులో భూపాలపల్లి జిల్లాకు చెందిన కొందరు ఉన్నట్లు తెలిసింది. వారే అలుగు ఫొటోలను అప్‌లోడ్ చేసి అమ్మకానికి పెట్టారు.. ఇలాంటి నెట్‌వర్క్‌తో ఇక్కడి వారికి సంబంధాలు ఉండటం విస్తుగొల్పుతోంది. ఎన్నేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందో తెలుసుకునే పనిలో అటవీ అధికారులు, పోలీసులు ఉన్నారు.

మరో 8 మంది గుర్తింపు..

అలుగు విక్రయంలో ముందుగా ముగ్గురిని పట్టుకున్నారు. అయితే దీని వెనుక తతంగం నడుపుతున్న 8 మందిని గుర్తించారు. కాటారం, భూపాలపల్లి, మహాముత్తారం మండలాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన వారుండటం గమనార్హం. అందులో ఓ రాజకీయ నేత కూడా ఉన్నారు. ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకుంటే ఈ దందా పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందినవారు ఉండే అవకాశం ఉందని ఓ అధికారి చెప్పారు.

అరుదైన జంతు విక్రయాల ముఠాలు..

అంతరించిపోతున్న జంతువును వేటాడేందుకు ముఠాలు తిరుగుతుంటాయి. అలుగు, పులి, చిరుత, వాటి చర్మం, నక్షత్ర తాబేలు, రెండు తలల పాము, ఏనుగు దంతాలకు భారీగా డిమాండ్ ఉంటుందనే అపోహలతో వీటికోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అలుగును ఒకరు రూ.30 వేలకు కొన్నట్లు సమాచారం. వాటి పొలుసులకు డిమాండ్ ఉంటుందనేది ప్రచారంలో ఉంది. ఇది చేతులు మారుతూ రూ.3 లక్షల ధర పలికినట్లు తెలిసింది. అరుదైన జంతువులకు ధరలు ఊహించుకుని వాటిని గుట్టుగా వేటాడుతూ దందా నడుపుతున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

రాత్రిళ్లే ఎక్కువగా వేట సాగుతోంది. రాత్రిళ్లు అటవీ అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. వేటగాళ్లు ఆయుధాలతో ఉంటారు. ఇది అధికారులకు సమస్యగా మారింది. వారికి కూడా రక్షణ కరవైంది. తగిన చర్యలు తీసుకుని ఇప్పటికైనా వేటను అరికట్టాల్సిన అవసరం ఉంది.

ఉచ్చులు.. విద్యుదాఘాతం

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులున్నాయి. పులులు, చిరుతలు, జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, తదితర జంతువులున్నాయి. రాత్రి వేళల్లో గుట్టుగా విద్యుదాఘాతం, ఉచ్చులతో వేటాడుతున్నారు. విద్యుదాఘాతంతో మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం తాడ్వాయి అడవుల్లో పులిని కూడా వేటాడి చంపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

వేటను అరికడుతున్నాం..

-వసంత, డీఎఫ్‌వో, జయశంకర్ భూపాలపల్లి

వన్యప్రాణుల వేటను అరికడుతున్నాం. వేటతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణుల చట్టాలు, శిక్షలపై వివరిస్తున్నాం. రాత్రి పూట గస్తీ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సహకరించాలి. వన్యప్రాణుల వేటపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

హాని తలపెడితే శిక్ష తప్పదు..

- వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయి. పులిని ఆటపట్టించినా.. భయపెట్టినా ఆరు నెలలు శిక్ష పడుతుంది.
- పులి, అలుగు, ఇతర షెడ్యూల్-1లో పరిధిలోని ప్రాణులను వేటాడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదవుతుంది. 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా పడుతుంది.
- రెండోసారి కూడా అదే తప్పుచేస్తే రూ.25 వేల జరిమానా 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్ష.
- పులి ఉండే అభయారణ్యంలోని కోర్ ఏరియాల్లో వేటాడితే 3 నుంచి ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటుంది.
- రెండు అంతకంటే ఎక్కువసార్లు వేటాడితే రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది.
- పులిని వేటాడినట్లు సరైన ఆధారాలుంటే నిందితులను వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చు..

లలితా మహా త్రిపురసుందరి దేవిగా భద్రకాళి





పల్లకీలో అమ్మవారి ఉత్సవమూర్తి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదోరోజు సోమవారం శ్రీభద్రకాళి అమ్మవారు లలితా మహా త్రిపురసుందరి(రాజరాజేశ్వరి)గా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పల్లకీ సేవ, సాయంత్రం శేష వాహన సేవ జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు లలితా మహాయాగంలో పాల్గొన్నారు. 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. -రంగంపేట, న్యూస్‌టుడే

'బోధనా రుసుం విడుదలైతేనే కళాశాలలు తెరుస్తాం'



రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమన్యాల సంఘ బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు దసరా తరువాత నిరవధికంగా మూసివేస్తున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘ బాధ్యులు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మూడేళ్ల నుంచి యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల జాప్యం కారణంగా, పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉపకార వేతనాల విడుదలలో ఆలస్యం కారణంగా అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామన్నారు. పది నెలలుగా ముఖ్యమంత్రికి, వివిధ శాఖల మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా, నేటివరకు ఎలాంటి పరిష్కార నిర్ణయం వెలువడలేదన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధన

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఈ నెల ఒకటి నాటికి రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినట్లు వరంగల్ డీసీసీబీ, రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు దీటుగా వరంగల్ డీసీసీబీ ఉత్తమ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని బ్యాంకు కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన బ్యాంకు మేనేజర్లు, సీఈవో, అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. తొలుత బ్యాంకు రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినందుకు ఆయన కేకు కోసి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్‌కు తినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడుతూ తాను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.12 వందల కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందన్నారు. ఈ ఘనత సాధనలో తోడ్పడిన సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంకు మేనేజర్లు, ఉద్యోగులు, సీఈవోలు, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. రుణమాఫీ పొందిన బ్యాంకు పరిధిలోని రైతులందరికీ వెంటనే కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని మేనేజర్లకు సూచించారు. రుణమాఫీకి అర్హతగల రైతుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై జిల్లా సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇంకా డీసీసీబీ జీఎం ఉష, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజునాయక్, ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల మేనేజర్లు, సీఈవోలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



లాంగ్ జంప్



అండర్-20 బాలికల 800 మీటర్ల పరుగులో విజేతలు



60 మీటర్ల పరుగు పందెం..

-న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ! ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌళి అకాడమీకి చెందిన మోహిత్‌చౌదరి 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహూకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట, న్యూస్‌టుడే : పక్షం రోజులుగా రద్దయిన రైళ్లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్- హసన్‌పర్తి రోడ్ మధ్య నాలుగో లైను పనుల కారణంగా సెప్టెంబరు 22 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు కాజీపేట- బల్లార్షా, వరంగల్- బల్లార్షా మార్గంలో నడిచే దాదాపు అన్ని రైళ్లను రద్దు చేశారు. కొన్ని రైళ్లను దారి మళ్లించారు. దూర ప్రాంత రైళ్లను మాత్రం నడిపించారు. రద్దయిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, ఇంటర్‌సిటీ, సింగరేణిలు 8వ తేదీన, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 9వ తేదీ నుంచి ప్రారంభమౌతాయి. పండగ వేళ రద్దు కావడంలో ప్రయాణికులు ఇప్పటికే ఇతర మార్గాల ద్వారా ప్రయాణాలు చేశారు. నేటి నుంచి పునఃప్రారంభం అవుతుండటంతో ఇప్పటికే చాలా మంది రిజర్వేషన్లు చేసుకున్నారు. కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీలో వెయిటింగ్ లిస్టు ఎక్కువగా ఉంది.

దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు శిక్ష

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పట్టపగలు ఇంట్లో చొరబడి.. విలువైన బంగారు ఆభరణాలు, డబ్బు దోచుకెళ్లిన నలుగురు దోపిడీ దొంగలకు ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ.. హనుమకొండ జిల్లా ప్రధాన సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి క్షమాదేశ్‌పాండే సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అలవాల సమ్మయ్య 2014 సెప్టెంబరు 26న మధ్యాహ్నం బయటకు వెళ్లారు. అదే సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన షేక్ అలీ హైదర్, కుమారస్వామి, శంకర్, మధుకర్, కోరుట్లకు చెందిన శివకృష్ణ, మహ్మద్ అసీఫ్ ఒక ముఠాగా ఏర్పడి.. హనుమకొండలోని గణేశ్‌నగర్‌కు వచ్చారు. అలవాల సమ్మయ్య భార్య ఒంటరిగా ఇంట్లో ఉండటాన్ని గమనించారు. బయట ఒకరు కాపలా ఉండి.. మిగతావారు ఇంట్లో చొరబడి ఆమెను బంధించారు. విలువైన వస్తువులు మూటగడుతుండగా.. అదే సమయంలో బయటకు వెళ్లిన సమ్మయ్య ఇంటికి వచ్చారు. బయట ఉన్న వ్యక్తిని ఎవరు నువ్వు అని ప్రశ్నించగా.. అతడు సమ్మయ్యను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి బంధించాడు. అనంతరం ఆభరణాలు, నగదు, చరవాణులతో ఉడాయించారు. బాధితుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు పైవిధంగా శిక్ష విధించింది. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ వాదించారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ సుభాష్ సాక్ష్యులను ప్రవేశపెట్టారు.

నేటి నుంచి రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీ రోడ్‌లోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వరంగల్ చేనేత, జౌళి శాఖ ఏడీ రాఘవరావు తెలిపారు. ప్రదర్శనలో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే చేనేత సహకార సంఘాలు, సంస్థలు ఎలాంటి రుసుం లేకుండా అమ్మకాలు జరుపుకోవచ్చన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, చీరాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్ షీట్లు, లుంగీలు, టవళ్లు, పత్రంజిలు, కార్పెట్లు తదితరాలు విక్రయిస్తారని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు పాల్గొంటున్నట్లు రాఘవరావు తెలిపారు.

EENADU e Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

కాకతీయ యూనివర్సిటీకి దగ్గర్లో, Reliance Smart Pointకి సమీపంలో నెలకు 25K Rents వచ్చే నార్త్ ఈస్ట్ ఫేసింగ్‌లో గల G+1 ఇల్లు (221 S.Yards) అమ్మకానికి కలదు. సంప్ర॥ 8985947319.

వరంగల్ మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq.Yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకము కలదు. సంప్ర॥ 7416839492.

న్యూవిల్లా హన్మకొండ హంటర్ రోడ్ శ్రీరామ హిల్స్‌లోని గేటెడ్ కమ్యూనిటీలో 150 చ॥గ॥లో నిర్మించిన 2767 Sft. @ 6,000/- per S.Ft. N/F తో విల్లా అమ్మబడును. Ready to Occupy. అదాలత్ నుండి 5 ని॥లో Drive చేరవచ్చు. Cont: 8121577958.

PLOT FOR SALE

ములుగు రోడ్డు దగ్గరలో ఆరేపల్లి NSR & ప్రతిమా హాస్పిటల్ దగ్గరలో & పరిసర ప్రాంతంలో, 30KM లోపు ప్లాట్లు, వ్యవసాయ భూములు మరియు ఇండ్లు అమ్మబడును/ కొనబడును. సంప్ర॥ 9281131001.

HNK, KITS అంబాల రోడ్, ముచ్చర్ల రోడ్ New Hywayకి 100మీ॥ సమీపంలో 166 గ॥ & 333 గ॥ & 466 గ॥ ప్లాట్లు అమ్మబడును. సంప్ర॥ Ph: 9553255936.

LEASE/ RENT

Total Building 3 floors Each Floor 2000 Sft. Ready to occupy with false Ceiling work done Lift, Cellar, Pent House available. Beside DPS Primary School, Prashanthnagar. ✆ 6302894889.

AGRICULTURE LANDS

1 Acre Land With Bore Good for Farmhouse 500mtrs To HNK-KNR HW Near Elkaturthy. Phone: 9866883432, 9100910097

TO LET

COMMERCIAL

హన్మకొండ కాకాజీ కాలనీ వీణా మెడికేర్ ఎదురుగా మెయిన్ రోడ్‌కు 25X12 Feets గల షట్టర్ కిరాయికి ఇవ్వబడును. వివరాలకై సంప్ర॥ 8341436060.

JOBS

Hydలో 5 స్టార్ హోటల్స్, మల్టిపెక్స్ మాల్స్, సర్వీస్ బాయ్స్ & గర్ల్స్. 16000/- to 24000/- ఫ్రీ రూం+మీల్స్. సె.గార్డ్స్, సూ.వైజర్స్. Ph: 8466882075, 9703006077


ప్రముఖ ISO సర్టిఫికేట్ గల కంపెనీలో పనిచేయుటకు మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ స్త్రీ/ పు కావలెను. ప్రతి నెల లక్ష ఇన్‌కం VRS రిటైర్మెంట్ వారికి కూడా ప్రాధాన్యత. సం॥ 9866137009.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 8317512135.

TO BOOK YOUR CLASSIFIED
5 lines Advt.
B/W Rs. 430/-
Colour Rs. 495/- only
★ GST 5% అదనం
For Advertisement Enquiry
Please Contact to
80080 01791
80086 95558
80085 59193

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రసం పీల్చే.. పురుగుల పనిపడదాం..!



ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్యపంటగా ఉంది. పూత, కాతగా దశలో ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తిలో ప్రధానంగా రసం పీల్చే పురుగులు ఉద్ధృతి పెరుగుతున్న పరిస్థితిని గమనించామని మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, పంట ఉత్పత్తి విభాగ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ తెలిపారు. సస్యరక్షణ చర్యలను 'రైతేరాజు'కు వివరించారు.

-న్యూస్‌టుడే, మానుకోట

పేనుబంక : లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చుతాయి. ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామరపురుగు : తల్లిపిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులో ఉండి రసం పీల్చుతాయి. ఆకులు పెలుసుగా మారుతాయి. నివారణకు.. మోనోక్రొటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటర్ నీటికి లేదా డైఫెన్ థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పెనీటోరం 0.9 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండినల్లి : చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లిపురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత గల వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు ప్రొపెనోఫాస్ 50 ఈసీ లేదా మిథైల్‌పారాథియాన్ 50 ఈసీ ఎసిఫేట్ 2 గ్రాములు+ట్రైటాన్ లేదా సాండోవిట్ లాంటి జిగురు మందులు ఒక మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పచ్చదోమ : ఆకుల అడుగుభాగాన పిల్ల, తల్లి పురుగులు చేరి రసం పీల్చడం ద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులో మారుతాయి. నివారణకు.. ఇమిడాక్లోప్రిడ్ లేదా ఫ్లొనికామైడ్ లేదా ఫిప్రొనిల్ లీటరు నీటికి రెండు మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫెట్ 75 ఎస్‌పీ ఒకటిన్నర గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ : పిందె, కాయ దశలో ఆశిస్తుంది. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. నివారణకు డైఫెన్‌థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరోమెసిసిన్ ఒక మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.76 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు



మిరపనారు

కొంటున్నారా.. జాగ్రత్త సుమా!

మానుకోట, న్యూస్‌టుడే : మిరపనారు కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలని మహబూబాబాద్ జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల తెలిపారు. ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే మిరప నారును కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చే మిరపనారు కొనుగోలును ఎలాంటి ధ్రువీకరణ, బిల్లులు లేకుండా కొనుగోలు చేయవద్దు. పేరొందిన కంపెనీలు, రకాల నారును వ్యవసాయ, ఉద్యాన శాఖలచే ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ విషయంలో సందేహాలు ఉంటే రైతులు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులను సంప్రదించాలని చెప్పారు.

ప్రశ్న - సమాధానం

? యాసంగిలో కంది, పెసర సాగు చేసేందుకు అనువైన రకాలు, అవసరమైన విత్తనం.. ఎప్పటివరకు సాగు చేసుకోవచ్చో తెలపండి..? – మారపల్లి రామచంద్రారెడ్డి, హసన్‌పర్తి.



✔ యాసంగిలో పెసరను అక్టోబర్ చివరి వరకు విత్తుకోవచ్చు. పెసరలో ఎంజీజీ 295, ఎంజీజీ 397(మధిర), ఎంజీజీ 378(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), డబ్ల్యూజీజీ 37 (ఏకశిల), డబ్ల్యూజీజీ 72(యాదాద్రి) రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కందిని అక్టోబర్ 15 వరకు ఏక పంటగా, వేరుసెనగతో మిశ్రమంగా సాగుచేసుకోవచ్చు. కందిలో డబ్ల్యూఆర్‌జీ 53, టీడీఆర్‌జీ 4, ఆర్‌జీటీ1, పీఆర్‌జీ 158, ఎంఆర్‌జీ 41, పీఆర్‌జీ 158 ఎంజీఆర్‌జీ 1004 రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

-కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే



రైతు రవీందర్



సర్వి చెట్లు.. ఆదాయానికి మెట్లు

న్యూస్‌టుడే, రేగొండ(భూపాలపల్లి జిల్లా) : తక్కువ పెట్టుబడితో సర్వి మొక్కల పెంపకం చేపడితే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం భాగిర్థిపేట గ్రామానికి చెందిన రైతు రవీందర్.. ఎకరానికి మూడేళ్లకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని 'రైతేరాజు'కు వివరించారు. 'భాగిర్థిపేటలో రెండెకరాలు, కొత్తపల్లిలో మరో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. కొత్తపల్లి గ్రామంలోని వ్యవసాయ భూమిలో రెండేళ్ల కిందట ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఓ మిత్రుడి సూచనతో అంతర్గత పంటగా సర్వి మొక్కల పెంపకం చేపట్టాను. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు నుంచి రూ.2.40 పైసలకో మొక్క చొప్పున సుమారు 3600 మొక్కలు కొనుగోలు చేశాను. ఐదుగురు కూలీల సాయంతో రెండెకరాల్లో 19 నెలల కింద మొక్కలను నాటాను. 30 నుంచి 36 నెలలకు మొక్కలు కటింగ్ దశకు చేరుతాయి. ఒక్కో టన్నుకు రూ.5600 నుంచి రూ.6600 వరకు ధర ఉంటుందని కంపెనీ వారు చెప్పారు. ఎకరానికి సుమారు 60 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రెండెకరాల్లో సుమారు 120 నుంచి 140 టన్నుల వరకు కలప వస్తే, టన్నుకు రూ.5600 ధర ఉన్నా ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు. కంపెనీ(పేపర్ మిల్లు) వారే కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేవు. మొక్కలు, కూలీల, కలుపు మందులు రూపేణా ఇప్పటివరకు కేవలం రూ.10 వేల మాత్రమే ఖర్చయింది. ఆయిల్‌పామ్ కాత దశకు చేరేసరికి సర్వి మొక్కల పెంపకం పెంపకం అయిపోతుందని' వివరించారు.

(c) eenadu

ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపండి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన వినతులకు వెంటనే పరిష్కార మార్గం చూపించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 79 దరఖాస్తులు అందాయి. ఎక్కువగా ధరణి సమస్యలే ఉన్నాయి. కొందరు వ్యక్తిగత సమస్యలు, మరి కొందరు సామాజిక సమస్యలకై దరఖాస్తులందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వ్యయప్రయాసాలకోర్చి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో ఇక్కడికి వస్తారని వారిని నిరుత్సాహపరచకుండా పరిష్కారానికి మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌వో గణేష్, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులపై కమిషనర్ ఆగ్రహం

కార్పొరేషన్: ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వీడాలి. వచ్చే వారంలోగా 80 శాతం సమస్యలు పరిష్కరించాలని వింగ్ అధికారులను గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల తీరు సరిగాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల అధికారులను మందలించారు. సోమవారం బల్దియా సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో 70 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణి అర్జీలపై వారాంతపు సమీక్షలు ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు.

కష్టం తీరింది.. కొలువు దక్కింది!


ఉద్యోగ నియామక పత్రంతో శ్రీజ

ఐనవోలు, న్యూస్‌టుడే: ఆమెది నిరుపేద కుటుంబం. పదేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి తన చెల్లితో కలిసి ఎన్నో కష్టాలను ఎదుర్కొంది. పట్టుదలతో చదువుకొని ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది. ఐనవోలుకు చెందిన బొల్లెపల్లి శ్రీజ చిన్నతనంలోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందారు. చెల్లి ఉష ఇద్దరూ ఒంటరి అయ్యారు. నానమ్మ, పెద్దనాన్న, బాబాయిలు భరోసాగా నిలిచారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారాన్ని అందిపుచ్చుకొని వారిద్దరూ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. జనగామ జిల్లా జఫర్‌గడ్‌లోని మా ఇల్లు ఆశ్రమం సహకారంతో అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శ్రీజ బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశారు. 2022లో వ్యవసాయశాఖలో ఖాళీల భర్తీ కోసం ఉద్యోగ ప్రకటన విడుదల చేయగా శ్రీజ దరఖాస్తు చేసుకుంది. 2023 మే నెలలో జరిగిన పరీక్ష రాశారు. గత ఫిబ్రవరిలో ర్యాంక్ జాబితాను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయగా మల్టీజోన్-1లో 22వ ర్యాంకు సాధించి ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైంది. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదగా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంది. ఉద్యోగం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తన చెల్లి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎంబీఏ చదువుతుందని, ఆమె స్థిరపడితే మరింత సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. పట్టుదలతో చదువుకొని ఉద్యోగం సాధించిన యువతిని పలువురు అభినందించారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బాలసముద్రం, న్యూస్‌టుడే: ఆర్ఈసీ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం హనుమకొండ డీఈ సాంబరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) జులైవాడ 9059585150 బాలసముద్రం 81438 11118 పరకాల 9849211303

కాలువను శుభ్రం చేశారు

స్పందనకు వందనం

భీమారం, న్యూస్‌టుడే: భీమారంలోని బ్యాంకు కాలనీలో పది రోజులుగా మురుగు కాలువను శుభ్రం చేయడం లేదని, దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు. సమస్యను జవాన్ సురేష్‌కు తెలుపగా పారిశుద్ధ్య కార్మికులతో కాలువను శుభ్రం చేయించారు.

రహదారులను..

హసన్‌పర్తి: భీమారంలో పారిశుద్ధ్య కార్మికులు వారం రోజులుగా రోడ్లను శుభ్రం చేయకపోవడంతో రోడ్లపై చెత్త పేరుపోయిందని స్థానికులు తెలిపారు. సమస్యను జవాన్ సురేశ్ దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య కార్మికులతో రోడ్లను శుభ్రం చేయించారు.

శక్తి స్వరూపిణీ నమోస్తుతే!


పరకాలలోని కుంకుమేశ్వరస్వామి ఆలయంలో..


శాయంపేటలో..


కొత్తకొండ వీరన్న క్షేత్రంలో

పరకాల, న్యూస్‌టుడే: పరకాలలోని భవానీ సమేత కుంకుమేశ్వరస్వామి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం చంద్ర గంట లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

శాయంపేట : శాయంపేటలోని శివ మార్కండేయ ఆలయంలో అమ్మవారిని లలిత త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రారంభించారు.

చేపల మార్కెట్లు ఏర్పాటు చేయాలని ఆందోళన


బల్దియా ఎదుట మత్స్యకారులు

రంగంపేట, న్యూస్‌టుడే: వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో చేపల మార్కెట్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం చేపల విక్రయదారులు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ డా. అశ్విని తానాజీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాజీపేట బాపూజీనగర్, ఫాతిమా కూడలి, వడ్డేపల్లి చర్చి, తిరుమల బార్ సెంటర్, కుమార్‌పల్లి, పెగడపల్లి డబ్బాలు, హసన్‌పర్తి చెరువు కట్ట, వరంగల్ అండర్ బ్రిడ్జి, కాశీబుగ్గ, దేశాయిపేట తదితర ప్రాంతాల్లో కొన్నేళ్లుగా వందలాది మంది మత్స్యకారులు చేపలు అమ్ముతున్నారని, కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంకట్ ఆరోపించారు. రూ.50 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు. మత్స్యకారులు, కార్మిక సంఘం నాయకులు నిమ్మల రాజేందర్, దుర్గయ్య, రవి, శ్రీలత, మమత, వనమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి హత్యాయత్నం


రాజేందర్‌కు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

మడికొండ, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో అన్నపై తమ్ముడు కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...అయోధ్యపురానికి చెందిన రాజుగారి వీరమ్మకు రాజేందర్, వెంకటేశ్, సుధాకర్ ముగ్గురు సంతానం. వృద్ధురాలైన తల్లి వీరమ్మకు పింఛన్ వస్తుండగా రెండో, చిన్న కుమారునితో ఉంటుంది. తల్లిని చూసుకోవాలని పెద్దవాడైన రాజేందర్‌ను వెంకటేశ్, సుధాకర్‌లు ప్రశ్నించారు. పింఛన్ డబ్బులు తింటున్నారు మీరు చూసుకోవాలని అప్పుడప్పుడు గొడవ పడుతుండేవారు. సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలో రావణ వధ విగ్రహం తయారు చేస్తుండగా, సుధాకర్, రాజేందర్ కుమారులు గొడవ పడ్డారు. రాజేందర్ జోక్యం చేసుకొని విషయం ఉంటే తనకు చెప్పాలని ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించినందుకు తమ్ముడు వెంకటేశ్ కత్తితో తలపై దాడి చేశాడు. వైద్య సేవల కోసం ఎంజీఎంకు తరలించారు. సంఘటన స్థలాన్ని మడికొండ ఎస్సై జె.రాజబాబు సందర్శించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బతికుండగానే పింఛను ఆపారు!


జాబితాలో పేరు తొలగించిన పత్రం చూపిస్తున్న బాధితురాలు సమ్మక్క

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ఓ వితంతువు బతికుండగానే అధికారుల నిర్లక్ష్యంతో మూడు నెలలుగా పింఛను ఆపేసిన ఘటన ఇది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామానికి చెందిన ధర్మారం రాజమల్లు సుమారు 30 ఏళ్ల క్రితం మృతిచెందారు. ఆయన భార్య సమ్మక్క సుమారు 15 ఏళ్ల నుంచి వితంతు పింఛన్ పొందుతున్నారు. ప్రతి నెలా ఎల్కతుర్తిలోని బ్యాంక్ వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకుంటుండగా, జులై నెలలో సమ్మక్క మృతి చెందినట్లు బ్యాంక్ ఖాతాలో తప్పుగా నమోదైంది. ఎప్పటి మాదిరిగా పింఛన్ కోసం బ్యాంక్‌కు వెళ్లగా జాబితాలో మృతిచెందినట్లు నమోదైనందున పింఛను ఇవ్వలేమనటంతో కన్నీటి పర్యంతమైంది. మూడు నెలల నుంచి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, ఎల్కతుర్తిలో మండల పరిషత్తు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లావణ్యను వివరణ కోరగా తమ తప్పిదం లేదని, డీఆర్‌డీఏ కార్యాలయానికి పంపించినట్లు పేర్కొన్నారు. తనకు పింఛను వచ్చేలా అధికారులు న్యాయం చేయాలని ఆమె వేడుకుంటున్నారు.

14న రౌండ్‌టేబుల్ సమావేశం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యా పరిరక్షణ కమిటీ బాధ్యులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: సరైన విద్యా విధానం తీసుకురాకుండా రాష్ట్రప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోందని విద్యా పరిరక్షణ కమిటీ బాధ్యులు అన్నారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జీవో నెంబర్ 25 ద్వారా పాఠశాల విద్యకు పునాదిగా ఉన్న ప్రాథమిక బడులను మూసివేసే కుట్ర చేస్తోందని తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 7.30 శాతం నిధులు కేటాయించిందని చెప్పారు. దీంతో బడెల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ నెల 14న తెలంగాణలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యావేత్తలు, ఆచార్యులు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ప్రజా సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతలు, విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు ఎన్.తిరుపతి, కె.భోగేశ్వర్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ వద్దు


మాట్లాడుతున్న దినేశ్‌మాదిగ

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ఎస్సీల వర్గీకరణ అమల్లోకి వచ్చేవరకు ఉద్యోగాల భర్తీని తాత్కాలికంగా నిలిపివేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేశ్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాజీపేటలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దినేశ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తే మాదిగలకు ద్రోహం చేసినట్లేనన్నారు. ఈ నెల 9న హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసాన్ని చాటుతామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి 11,062 ఉపాధ్యాయ పోస్టులను ముందుగానే భర్తీ చేయడం మాదిగ జాతికి నమ్మక ద్రోహం చేయడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌మాదిగ, సీనియర్ నాయకులు వెంకటస్వామి, సారంగపాణి, రేణికుంట్ల మహేశ్, స్వరాజ్, మాతంగి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జూద కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు డివిజన్‌లో జూద కేంద్రాలపై సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి జూదం ఆడుతున్న వారిని పట్టుకొని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు మిల్స్‌కాలనీ ఠాణా పరిధి క్రిస్టియన్ కాలనీలో మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి జూదమాడుతున్న నలుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ. 13వేల నగదు స్వాధీనం చేసుకున్నాం. మట్టెవాడ ఠాణా పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన మరో ఆరుగురు జూదం ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 8,460 స్వాధీనం చేసుకొని కేసు నమోదు విచారణ కోసం ఆయా ఠాణాల్లో అప్పగించారు.

వరంగల్‌క్రైం: ఇంతెజార్‌గంజ్ ఠాణా పరిధి తిలక్‌నగర్‌లోని సట్టా కేంద్రంపై సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు తిలక్‌నగర్‌కు చెందిన షేక్ షకీల్ సట్టా ఆడుతూ పట్టుబడ్డారు. షకీల్ నుంచి రూ.2910 నగదు, చరవాణి, సట్టా చిట్టీలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు విచారణ కోసం ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కూతురు మృతి చెందిదని ఆరోపిస్తూ సోమవారం హనుమకొండ చౌరస్తాలోని ఓ ఆసుపత్రి ఎదుట మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. బాధితుల వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా పత్తిపల్లి గ్రామానికి చెందిన కవిత, జయపాల్ దంపతుల కూతురు వర్షిత(8) డెంగీతో బాధపడుతుండగా ములుగులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రెండు రోజులు చికిత్స అందించారు. జ్వరం తగ్గకపోవడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు ఈ నెల 2న ఇక్కడి ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆదివారం మధ్యాహ్నం తల్లి చిన్నారితో మాట్లాడింది. సాయంత్రం మాత్రం చిన్నారిని కలిసేందుకు వైద్యులు తల్లికి అనుమతించలేదు. వైద్య ఖర్చుల కోసం రూ.4లక్షలు వసూలు చేశారని తెలిపారు. ఒక ఇంజెక్షన్ ఖరీదు రూ.53 వేల చొప్పున మూడింటిని వేశారన్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలపకుండా మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని ఒత్తిడి చేశారని రోదించారు. వైద్యుల నిర్లక్ష్యం వలన తమ పాప చనిపోయిందని ఆందోళన చేశారు. ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండు చేశారు.

వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు

మడికొండ: పారిశుద్ధ్య కార్మికుల నుంచి మడికొండ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డబ్బులు డిమాండ్ చేస్తూ, దుర్భాషలాడుతున్నారని నగర పాలక సంస్థ సీఎంహెచ్‌ఓకు కార్మికులు ఫిర్యాదు చేశారు. రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

కేయూ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్

భీమారం : కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ సీఐగా సుంకరి రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బి.సంజీవ్‌కుమార్ ఎస్‌బీ వరంగల్‌కు బదిలీపై వెళ్లారు. టాస్క్‌ఫోర్స్ వరంగల్ సీఐగా పనిచేస్తున్న రవికుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

భీమదేవరపల్లి: గట్లనర్సింగాపూర్‌లో ప్రమాదవశాత్తు బావిలో పడి లోకిని పోచమ్మ(85) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు ములుకనూర్ ఏఎస్ఐ సంపత్ సోమవారం తెలిపారు. సోమవారం బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గుడుంబా విక్రేతపై కేసు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గుడుంబా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేశారు. ఆత్మకూరుకు చెందిన పాండవుల వనమ్మ గుడుంబా విక్రయిస్తుండగా.. సోమవారం పోలీసులు దాడి చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలకుంటకు చెందిన బాలు వద్ద గుడుంబాను కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు వనమ్మ తెలిపింది. ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు.

104.8FM Warangal
ఈ FM 104.8 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180620, 9000180623

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎనికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటానని ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు వెల్లడించారు. భీమదేవరపల్లి మండలం ములుకనూర్ ఎస్ఆర్‌కే పాఠశాలలో సోమవారం ట్రస్మా, నిరుద్యోగులతో సమావేశమయ్యారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న పట్టభద్రులు తనకు పూర్తి మద్దతు ప్రకటించారన్నారు.

కాజీపేట మీదుగా నాగ్‌పూర్‌కు ప్రత్యేక రైలు

కాజీపేట, న్యూస్‌టుడే: దసరా పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే బీదరు నుంచి నాగ్‌పూర్‌కు కాజీపేట మీదుగా ప్రత్యేక రైలు నడుపుతోంది. ఈ నెల 11న 07023 నంబరుతో బీదరులో సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి కాజీపేటకు రాత్రి 11.48 గంటలకు, నాగ్‌పూర్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటుంది. నాగపూర్‌లో 13వ తేదీన 07024 నంబరుతో రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరునాటి ఉదయం 3.38 గంటలకు కాజీపేట, బీదరుకు 11.00 గంటలకు చేరుకుంటుంది.

'అమ్మ కోసం మొక్క నాటు'


పర్యావరణ నినాదాలు చేస్తున్న పవర్‌గ్రిడ్ అధికారులు, సిబ్బంది

బాలసముద్రం, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్కు ఆవరణలో 'అమ్మకోసం మొక్క నాటు' అంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు శుభ్రం చేసి మొక్కలు నాటారు. పర్యావరణ హితం కోసం రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. పవర్‌గ్రిడ్ డీజీఎం సమ్మయ్య, జూనియర్ ఇంజినీర్ సీహెచ్.సంపత్, తదితరులున్నారు.

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత


ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

కాజీపేట(సిద్ధార్థనగర్), న్యూస్‌టుడే: చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని, ప్లాస్టిక్‌ను ఇతర వ్యర్థాలను చెరువులో వేయకూడదని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు విశ్రాంత అటవీశాఖ అధికారి పురుషోత్తం అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, జనవిజ్ఞాన వేదిక, వనసేవా సొసైటీల ఆధ్వర్యంలో సోమవారం వడ్డేపల్లి చెరువు కట్టమీద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి కట్ట మీద ఉన్న ప్లాస్టిక్‌ను శుభ్రం చేశారు. పర్యావరణాన్ని రక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, హుస్నాబాదు తహసీల్దారు రవీందర్, జేవీవీ సమన్వయకర్త డాక్టర్ రాములు, ఔల్స్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్, నాగేశ్వరరావు, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శ్రవణ్, సుధాకర్, రాజ్‌కుమార్, లక్ష్మీ, వందన తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన జీడీఎస్‌లు


మంత్రి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న జీడీఎస్ బాధ్యులు

బాలసముద్రం, న్యూస్‌టుడే: గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు నేతృత్వంలో కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఉద్యోగులు కలిశారు. కమలేష్ చంద్ర కమిటీ అనుకూల సిఫారసుల అమలుతోపాటు గ్రామీణ డాక్ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘం నేతలు పెరుమాండ్ల తిరుపతి, జె.బాపూజీ, మర్రి కొమురారెడ్డి తదితరులున్నట్లు వివరించారు.

సంక్షిప్తంగా

గాజాపై మారణహోమం ఆపాలని నిరసన

బాలసముద్రం, న్యూస్‌టుడే: గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బిక్షపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి చక్రపాణి అన్నారు. నక్కలగుట్టలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం వామపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఏడాదికి పైగా సాగుతున్న భయానక మిలటరీ దాడుల కారణంగా అక్కడి ప్రజలు దిక్కుతోచని స్థితిలో జీవిస్తున్నారని చెప్పారు. గాజా జనాభాలో 8 శాతం ప్రజలు యుద్ధం వల్ల మృతి చెందారని తెలిపారు. క్షతగాత్రుల సంఖ్య లెక్కించలేకుండా ఉందన్నారు. భారత్, అరబ్ దేశాలతో పాటు ప్రపంచం మొత్తం పాలస్తీనియన్లకు అండగా నిలవాలన్నారు. ఆర్ఎస్‌పీ నేత కౌడగాని శివాజీ, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసి నేత గంగుల దయాకర్, వామపక్ష నేతలు సారంపల్లి వాసుదేవరెడ్డి, రాములు, తిరుపతి తదితరులున్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్, న్యూస్‌టుడే: భారాస మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో కాజీపేటకు చెందిన 29 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. భారాస పదేళ్ల పాలనలో అభివృద్ధిని విస్మరిస్తే, తొమ్మిది నెలల కాలంలో అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుంటే కల్వకుంట్ల కుటుంబం సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్, సయ్యద్ విజయశ్రీ రజాలీ, మానస రాంప్రసాద్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్‌కు దసరా సెలవులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులపాటు దసరా సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల సోమవారం తెలిపారు. ఈ నెల 10న దుర్గాష్టమి, 11న మహర్నవమి, 12న విజయదశమి పండగ సందర్భంగా, 13న మార్కెట్‌కు వారాంతపు సెలవు కావడంతో బంద్ ఉంటుందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: హనుమకొండ బాలసముద్రంలో ఆధునిక చెత్త రవాణా కేంద్రంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే గుత్తేదారుకు సూచించారు. సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి బాలసముద్రం వెహికిల్ షెడ్డు, వరంగల్ పోతననగర్ చెత్త రవాణా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. స్వచ్ఛ ఆటోల ద్వారా సేకరించే చెత్తను ఇక్కడి నుంచి రవాణా చేయాలన్నారు. వాహనాల మరమ్మతులు ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు డా.రాజారెడ్డి, డా.రాజేష్, డీఈ సారంగం, ఏఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి ఉత్సవాల్లో పాల్గొన్న సీపీ


సీపీ అంబర్ కిషోర్‌ఝా దంపతులను సత్కరిస్తున్న వేద పండితుడు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాజీపేట శివాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన శాకాంబరి పూజలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా దంపతులు పాల్గొన్నారు. దుర్గామాతకు సీపీ దంపతులు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపం చిత్రాన్ని సీపీ దంపతులకు అందజేసి అర్చకులు ఆశీస్సులు అందజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008001791
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008014568

పరకాల నియోజకవర్గం

ప్రజా సంక్షేమమే భాజపా ధ్యేయం


సభ్యత్వ రశీదు అందజేస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

దామెర, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే భాజపా ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. దామెరలోని 116, 117, 118 పోలింగ్ కేంద్రాల పరిధిలో సోమవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్, బూత్ అధ్యక్షుడు ఎక్కలదేవి రమేష్, కన్నె కొమురయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి


మార్కెట్‌ను పరిశీలిస్తున్న రాజిరెడ్డి

శాయంపేట, న్యూస్‌టుడే: పరకాల మార్కెట్ కమిటీ పరిధిలోని సబ్ మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని ఛైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం శాయంపేటలోని సబ్ మార్కెట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఈ మార్కెట్ యార్డులోనే పంటలను విక్రయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గోదాములకు మరమ్మతు పనులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మారపెల్లి రవీందర్, డైరెక్టర్ వెంకటరాజిరెడ్డి, నాయకులు దుబాసి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బోటు తరలింపునకు యత్నాలు

పరకాల, న్యూస్‌టుడే: పరకాల దామెర చెరువులోని పర్యాటకశాఖకు చెందిన బోటును మరో ప్రాంతానికి తరలించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో పర్యాటకాభివృద్ధి కోసం రెండేళ్ల క్రితం బోటును మంజూరు చేశారు. అప్పటి నుంచి బోటు నిరుపయోగంగా ఉంది. బోటుకు అమర్చిన గ్రిల్స్‌ను సోమవారం కొందరు విప్పారు. దీంతో మంగళవారం బోటును తరలిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై వివరణ కోరేందుకు 'న్యూస్‌టుడే' యత్నించగా జిల్లా పర్యాటకశాఖ అధికారి శివాజీ, పరకాల మున్సిపల్ కమిషనర్ నర్సింహ స్పందించలేదు.

TG
(c) eenadu